# మనుషులు

## ఘట్టి కృష్ణమూర్తి

రాత్రికి విశ్రాంతిగా కుర్చీలో పడుకుని పేపరు చదువుతున్నాడు మూర్తి. ఎంతసేపు చూసినా ఒకటే మనస్సు చిరాకెత్తే విషయాలు.

ఒకరు గొప్పవాళ్లు. వాళ్ళ జాతి గొప్పదీ, వాళ్లే అధికారానికి అర్హులు. మరొకరు తక్కువ వాళ్లు. మరికొంతమంది అధోగతిపాలై అట్టాగే అణగారిపోతూండడం. చదవాలనే ఆసక్తి పోయింది. పల్చని చీకటి తెరలా నిద్ర కమ్ముకొచ్చింది. అక్షరాలన్నీ అలికేసినట్టు కనుపించినై. తనకు తెలియకుండానే కళ్లు మూశాడు. పేపరుకూడ గుండెల మీద నిదరోయింది.

ఏదో... కల. తనెక్కడో ఏకాంతంగా నుంచున్నాడు. వాళ్ళెవరో గంధర్వులుట, రెక్కలు కట్టుకుని, పక్షుల్లా ఎగిరిపోతారుట. వాళ్లు అందరికంటె గొప్పవాళ్ళుట. మనుషులంటే వాళ్లకెంత నిరసనభావమో.

"మీరు మనుషులేనా?" అడిగారు గద్దించుతూ. "అవును" అని ధీమాతో సమాధానం చెప్పాడు.

"కాదు నీ మనుషుల్ని గురించి నీకే తెలియదు. నువ్వు మనిషివే కాదు" అన్నారు వెటకారంగా. రివ్వున గాలిలో ఎగిరిపోయారు.

పోతూ పోతూ ఒక రాతిగుండును అతని ముందర విసిరికొట్టారు. ఏమిటో అని దానిని మరో రాతిమీద విసురుగా కొట్టారు. అది పగిలింది. దానిలోనుంచి అనేక రంగులు గల రాతి ముక్కలు కింద పడినై. అవన్నీ పోగుచేసి ఒక చోట కుప్పగా పోశాడు.

ఇటు చూసేసరికి ఒక విచిత్రం. ఆ రాతి డొల్లలో "మనుషులు" అని రాసివున్నది. తన్ను తనే నమ్మలేకపోయినాడు. మళ్లీ రివ్వున ఏదో గాలివొచ్చినట్లుంది తల పైకెత్తి చూశాడు. రెక్కలు కట్టుకు ఎగిరిపోయే వొకడు తనవంక చూసి "మనుషులు" అని వికటంగా నవ్వాడు. గాలిలో ఎగిరిపోయినాడు. తనముందర కుప్పగా పోసిన రాళ్ళన్నీ ఎండలో మెరిసిపోతున్నై. ఒక్కొక్క రాతిముక్కమీదే "మ, ను, షు, లు" అని రాసివుంది. నాలుగుముక్కలూ వరుసగా పెట్టాడు. "మనుషులు" అనే మాటైంది. అలా ఎన్నోసార్లు తయారయినాయి.

గంధర్వుడు ఎందుకు నవ్వాడు? "మీరూ ఇంతే" ఆకాశవాణిలా ఒకమాట వినపడింది.

"అంటే...? అని తలపైకెత్తి చూశాడు. మరి సమాధానం లేదు.

ఒక్కటిమాత్రం అతని మనస్సుకు తోచింది. "నాలుగు రంగులు గల రాతిముక్కలూ ఒకచోట పెడితేగాని నాలుగు అక్షరాలూ కలిసి ఒక పేరుగా తయారవలేదు "మనుషులు" అని.

తనలోకి ఒక్కసారి చూసుకున్నాడు. తనకంటె ఎక్కువవాళ్లూ తనతోటివాళ్లూ తక్కువ వాళ్లూ, మరీ తక్కువవాళ్ళూ లోకంలో రోజూ చూస్తున్నానుగదా" అనుకున్నాడు.

ఎన్నడన్నా నలుగురూ ఒకటైనారా! లేదు అని తన మనస్సే తనకి సాక్ష్యమిచ్చింది. నాలుగు రాతిముక్కలూ విడివిడిగా పారేశాడు. అరంపరం లేని అక్షరాలు వాటిమీద దిగాలపడి చూస్తున్నై.

ఆ [illegible] కలి

గించింది. "నలుగురం కలిస్తేగాని ఒక వ్యక్తిగా తయారు కాలేదు. అప్పుడుగాని మేము మనుషులము" అని వెన్నువిరుచుకుని చెప్పలేరు. తమని చూసి నవ్వేవాళ్లందరికీ బుద్ధి చెప్పలేరు" అనుకున్నాడు.

తనతో కలిసే మనుషులకోసరం ప్రపంచమంతా నదులూ సముద్రాలూ పర్వతాలూ అన్నీ వెదికాడు. ప్రతివాడి మొహాన నిరర్థకమైన చిహ్నం ఒకటి కనపడుతుంది. ఎక్కడ చూసినా కళాకాంతులు లేవు. మెల్లగా మెల్లగా ఇద్దరు కలిశారు. ముగ్గురూ కలిసి మరొకడికోసరం మూలమూలలా దిగంతాలవరకూ వెతికారు. ఒకచోట దిక్కు మొహం వేసుకుని ఒకడు ఏడుస్తూ కూచున్నాడు. వాళ్ళనిచూసి మరీ ఏడ్చాడు. "ఎందుకు ఏడుస్తావ్?" అని ముగ్గురూ అడిగారు. "అతన్నెవరో కొంతమంది కలిసి "మాకంటె తక్కువవాడివి" అని వాళ్లలోనుంచి వెళ్ళగొట్టారుట. తనేమీ చెయ్యలేక ఇక్కడ కూచుని ఏడుస్తున్నాడుట" అతను చెప్పాడు.

"నువ్వుకూడా మాలో కలుస్తావా?" అని అడిగారు. ఎండిపోయిన అతని పెదవులమీద చిరునవ్వు తాండవించింది. అందరి సరసనా ఒచ్చి నుంచున్నాడు. రాతిముక్కలు వరుసగా పేర్చారు. తమవంక చూసుకున్నారు.

"మనిషి" అని ఏమూలనించో ఒకమాట వినపడింది.

"మేము మనుషులం" అని అరుచుకుంటూ ప్రపంచంలోకి నడిచిపోయారు.

ఇప్పుడు వాళ్లు ప్రపంచానికే క్రొత్త. వాళ్ల పద్ధతి వేరు. వాళ్ళ చిహ్నాలు వేరు. వాళ్లు చెప్పే మాటలు అందరికీ కంటకంగా తోచినై. నిర్జీవమయిన మొహాల్లో వాళ్లకి ప్రతిచోటా ప్రత్యక్షమయారు.

తామందర్నీ చూసి నవ్వారు ఎక్కిరిస్తున్నట్లుగా, కొందరు సిగ్గుతో తల వొంచుకున్నారు. కొందరు కోపంగా చూసి వెళ్ళిపోయారు. మరికొందరు వాళ్లమీద దాడి సాగించారు.

"మీరు మనుషులు కండి" అంటే వాళ్లు నమ్మరు. మీ అందరిలోనూ ఐక్యత సాధించబడాలి. అంటే వొప్పుకోరు. వాళ్ళ నిర్జీవమైన మొహాలే ప్రపంచానికి దారి చూపించుతాయని వాళ్ల గట్టి నమ్మకం.

ఎక్కడికి వెళ్ళినా వీళ్ళకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. నలుగురూ ఒకచెట్టుకింద కూచుని విచారించుకున్నారు.

"మనకి ఇక్కడే హాయిగా వున్నది, ఇక్కడే వుండిపోదాం" అన్నారు ముగ్గురూను. మూర్తి అందుకు వొప్పుకోలేదు.

"కాదు, మనం వాళ్ళల్లోకి వెళ్లాలి. అందరినీ తయారుచేసే మార్గముంటే వాళ్ళముందర ఎలుగెత్తి చాటాలి. ఆ ప్రపంచంలోకి పదండి" అని ప్రోత్సహించాడు.

"మనంకూడా రాతిముక్కల్లా ఊరూ పేరూ లేకుండా పోతాం" అని ప్రబోధించాడు.

"అయితే ఏం చెయ్యమంటావ్?" ముగ్గురూ ఆదుర్దాగా అడిగారు.

"పదండి" అన్నాడు మూర్తి ధైర్యంతో, నలుగురూ బయలుదేరారు.

ఇక నీ ప్రపంచంలో — ఒకరంటే ఒకరికి గిట్టదు. ఒకడు మరొకణ్ణి నాశనం చెయ్యాలని తీవ్ర ప్రయత్నాలు... ఎందుకు పుట్టారు... ఎందుకు పెరుగుతున్నారో... వీళ్లకి కాదు ఆ మాట వాళ్ళకే తెలియదు.

ఈ దారుణహింసాకాండను అరికట్టడం వాళ్ల కార్యక్రమంగా నిర్ణయించుకున్నారు నలుగురూను.


నలుగురూ నలువైపులా ప్రచారం చేద్దామనుకున్నారు. ఈ పరిస్థితుల్లో విడిపోతే ఏ పనీ కొన

## ఆనందవాణి పోస్టుబాక్సు నెంబరు

# 1583

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికి వ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడం ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు


చందనము —
శీతల పరిమళము
చందనమునకుగల అనేక ఉత్తమగుణములలో అనాదినుంచి అధికముగా ప్రశంసింపబడుచున్నది దానిలోనున్న ‘చలువ గుణము’. జ్వర దాహమును అణచుటకు ఔషధమునందు ఉపయోగింపబడుటయేగాక, చందన తైలము అలసిపోయిన అవయవములకు నూతనోత్తేజమును కలిగించును. పూర్వము నుంచి పరిశుద్ధతకు పర్యాయపదముగానున్న చందనము నేడు తన ఆధునిక స్వరూపముతో — “మైసూరు శాండల్ సబ్బు” పేరుతో చలువదనమును నూతనోత్తేజమును కలిగించుచున్నది.
మైసూరు
శాండల్ సబ్బు
పరిశుద్ధతకు ప్రసిద్ధమైనది చందనమే
B-I.TG.

సాగించలేమని తుదకు నిశ్చయించుకున్నారు.

అందరినీ ఈ అజ్ఞానంనుండి తొలగించి ఒక ఉన్నతపథంలోకి నడిపించాలంటే నూతన ప్రపంచ పౌరులుగా తయారు చెయ్యాలంటే ఒక్క అదర్శంతో ఒక్క వ్యక్తిగా నలుగురూ నిలబడిన నాడే ఈ గురుతర కార్యాన్ని నెరవేర్చగలము అనుకున్నారు. బయలుదేరారు ప్రపంచంలోకి.

నిస్సహాయులైన వాళ్ళు ఎన్నోచోట్ల తిరిగారు. ఎంతమందిలోనో తమ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. గంధర్వులు రాయిగొట్టిన వృత్తాంతం వివరించి చెప్పారు. మనమంతా ఒక గదిలోని వాళ్ళం" అని చాటారు. రాళ్లు కరిగేలా ఉపన్యసించారు.

కొన్ని పాషాణహృదయాలను వాళ్ల వాగ్ఝరి కరిగించలేకపోయింది, సిగ్గుతో తలవొంచుకున్న వారంతా తమకు సహచరులైనారు. మధ్యరకం వారు మా వాళ్లే అనుకున్నారు. ఒకవర్గం ఇంకా వాళ్లని ప్రతిఘటిస్తూనే వున్నది. రానురాను జీర్ణమై పతనోన్ముఖమైందికూడా.

అడుగుపెడితేనే అగాధంగా తోచిన యీ ప్రపంచంలో వాళ్లకు స్థానం దొరికింది. వాళ్ల సిద్ధాంతాలను ఎంతమందో ఆచరణలో పెడుతున్నారు. రాతిముక్కలమీద "మనుషులు" అన్నే మాట కొంతవరకూ చరితార్థత నొందింది. ఎంతో మంది మనుష్యులు కనులపండువగా కనపడుతున్నారు. వింతవింత వేషాలు ధరిస్తారు. అనేక రూపాలలో వుంటారు. కాని, వాళ్లందరి మనస్సులూ ఒక మార్గాన పరుగులు తీస్తూంటాయి.

ఆత్మనాశనం చేసుకునే మూఢాచారాలు మూఢనమ్మకాలూ వాళ్లలో నశించాయి. వాళ్లు చేసే ప్రతిపనిలోనూ అందరిక్షేమమూ ఇమిడి వుంటుంది. అదే వాళ్ల సిద్ధాంతంకూడాను. మానవ జాతిని సజీవంగా అట్టేపెట్టే మూలసిద్ధాంతాలు వాళ్లకు అడుగడుక్కీ ఆచరణీయాలు. అదో పెద్ద లోకం, మనుష్యలోకం—తమని చూసి నవ్విన ఇతర లోకాలకు "మేము మనుషులమూ" అని ధైర్యంగా నిలబడి సమాధానం చెబుతున్నారు. భూమ్యాకాశాల మధ్య వాళ్లకు గల అంతరం ఒకడుగు.—

"మనుషులు, మనుషులు" అని కలవరిస్తూ నిద్ర లేచాడు మూర్తి. ఎటువంటి కలొచ్చిందో అనుకున్నాడు.

# శబ్దం లేని ప్రపంచంకంటె శ్మశానవాటిక మేలు

* చౌదుల *
వెంకటరత్నం

★

మానవునికి 'నిశ్శబ్దం' అసాధ్యమయింది, ప్రకృతివిరుద్ధమయిందీని.

అతడు తన జీవితాన్ని ఏడ్పుతో మొదలుపెట్టి నిశ్శబ్దంతో ముగిస్తాడు. ఈ మధ్యకాలంలో ఏదో ఒక విధంగా శబ్దంచేస్తూనే తన జీవితాన్ని సాగిస్తాడు.

శబ్దంలేని ప్రాంతంలో నిలబడడానికి భయపడతాడు. ఎవరితోనైనా సంభాషిస్తేనేగాని మనసొప్పదు. తన స్నేహితులతో సంభాషించడానికి అతనికొక అభిలాష పుడుతుంది.

మన చెంత యింకొక వ్యక్తి లేనప్పుడు, మనం నిశ్శబ్దాన్ని అభినందిస్తాం. నిశ్శబ్దమై ప్రశాంతంగా వుండేచోట నివసించడానికి ఒకచోట నుండి యింకొక ప్రాంతానికి మారితే అదిచాల తెలివితక్కువ పని అని చెప్పవచ్చు. మనమొక నగరానికిగాని, యింకొక ప్రాంతానికిగాని పోతున్నామంటే నిశ్శబ్దంకోసంగాదు; వివిధరకాలైన శబ్దాలు వినడానికి—ఒక వుద్యానవనంలోగాని, తోటలోగాని కూర్చుంటే పగలంతాకూడ అనేక శబ్దాలు వినబడుతూనేవుంటాయి. నిజంగా మనం నిశ్శబ్దాన్ని యిష్టపడితే ఆ ప్రాంతంలో వుండే కోడి "కొక్కొరో"లు, మేక అరపులు కుక్కల మొరుగులు భరించలేక ఆ చోటు వీడి వెళ్ళిపో వలసివస్తుంది.

మనకు చీకటివల్ల జనించే భయం నిజంగా ఆ చోట వుండే నిశ్శబ్దం వలననే యని చెప్పక తప్పదు. ప్రపంచమంతా నిర్మానుష్యమని నమ్మడం దుస్సాధ్యం. రాత్రులు భీతిని కల్పించే శబ్దాలు వింటూ వుంటాం. ఈ శబ్దాలవల్ల విచ్ఛిన్నం కాబడే నిశ్శబ్దంవల్లనే ఆ భీతి జనిస్తుంది. ఇంకొక విషయం: శబ్దం లేని ప్రపంచంకంటె శ్మశానవాటిక మేలు.